# దండాలయ్యా దరమ పెబో

కోర్టు కిటకిట లాడుతోంది.

ముద్దాయిని బోనులోకి ప్రవేశపెట్టారు.

చిత్రమైన నేరం చేసిన ఆ మనిషి ఎలా ఉంటాడో?

జనం ఆ నేరస్తుడిని చూడటానికి తోసుకొన్నారు.

"ఆర్డర్...ఆర్డర్..."

ఆ వ్యక్తి నల్లగా, మొరటుగా, పెరిగిన గడ్డంతో, తైల సంస్కారం లేని జుట్టుతో, మురికి బట్టల్తో అసహ్యంగా ఉన్నాడు. అమాయకంగా, బెదురుచూపులు చూసే గొర్రెలా ఉన్నాడు.

అతని మీద కేసు పెట్టిన వారు ధనవంతులు. వారు కుదుర్చుకున్న ఖరీదైన లాయర్‌గారు ముద్దాయిని రకరకాల చిక్కు ప్రశ్నల్ని వేసి అదరగొట్టేడు. తన వాక్చాతుర్యంతో ప్రేక్షకుల్ని నవ్వించేడు.

"సో - మైలార్డ్, ఇతను చేసిన నేరం మానవాళికే తలవంపులు తెచ్చేది. ఒక మనిషి అలాంటి నేరాన్ని చేసేడని చెప్పుకోవటం మనందరికి సిగ్గుచేటు. అందుచేత నేరస్తుడికి కఠిన శిక్ష విధించాల్సిందిగా కోర్టువారిని కోరుచున్నాను."

లాయర్‌గారు వాదన ముగించారు. చప్పట్లతో కోర్టు మారుమోగింది.

"ఛీ...ఛీ... " అందరి నోళ్ళలో అదే అక్షరం.

"ఆర్డర్...ఆర్డర్..."

కోర్టు హాలులో మళ్ళీ నిశ్శబ్దం.

"నీ తరపున వాదించటాని కెవరైనా ఉన్నారా?" జడ్జి కరుణాకరం ముద్దాయిని చూసి ప్రశ్నించాడు.

ముద్దాయి మాట్లాడలేదు. అసలు, ప్రశ్నే అర్థం అయినట్లు లేదు.

శూన్యంగా, చిత్రంగా, భయంగా చూస్తున్నాడు.

"మీలో ఎవరైనా అతని తరపున ఉచితంగా వాదిస్తారా?"

లాయర్లు ఎవరూ ముందుకు రాలేదు.

ఆ లాయర్లలో పేదల కోసం కన్నీరు కార్చేవారు, విప్లవ రచయితలు, ప్రజలు ప్రజలు అని అరిచేవారు, మానవ హక్కులంటూ ఆందోళన చేసేవారు..... ఇలా చాలా రకాలవారు ఉన్నారు.

కాసేపు ఆలోచించి జడ్జిగారు ఆ కేసును మూడో రోజుకు వాయిదా వేసేరు.

"ఈ మూడు రోజులు ముద్దాయికి మంచి భోజనం పెట్టాలి. అన్ని సౌకర్యాలు

కలిగించాలి." ఆర్డర్ జారీ చేసి లేచాడు కరుణాకరం.

ఇంటికి వెళ్లినా అతనికి ఆ ముద్దాయి కథే గుర్తుకొస్తోంది.

స్వతహాగా ఆదర్శవాది, ఆచరణశీలి అయిన ఆయన కోర్టులో విన్న కథను ఈ విధంగా ఊహించాడు.

✡ ✡ ✡

కోటయ్య శరీరం తాగకుండానే తూలిపోతున్నది.

ఆకలితో కళ్ళు తిరుగుతున్నాయి.

కాళ్ళు కదలమని మొరాయిస్తున్నా బరువుగా అడుగుల్ని ముందు కేస్తున్నాడు.

కోటయ్య వ్యవసాయ కూలీ. ఏదో కారణంగా అతడిని గ్రామం వెలివేసింది. కూలీ పని దొరకలేదు. బ్రతుకు తెరువు వెతుక్కొంటూ పట్నం వచ్చాడు.

పట్నంలో అతని ఆకలి మరింత పెంచింది. అడుక్కు తినటానిక్కూడా అక్కడ స్వేచ్ఛ లేదు. అన్నిటికీ పోటీ.

ఆ మాయా ప్రంచాన్ని జయించే శక్తి అతనికి లేదు.

మానసికంగా కూడా నీరసపడిపోయాడు.

తన సమస్త శక్తితో అప్పుడు ఆకలి అతనిపై దండయాత్ర చేసింది.

అంతటి మహానగరంలో అతనికి అన్నం మెతుకులు గగనకుసుమాలయ్యాయి.

ఆ మెతుకుల కోసం అన్వేషణ.

ఉన్నట్లుండి కోటయ్య కాళ్ళు బ్రేకులు వేసినట్లు ఆగిపోయాయి.

ఒక్కసారిగా అతని నోరూరింది. శరీరంలోకి శక్తి వచ్చింది.

ఆ గిన్నె నిండా మల్లెపువ్వుల్లాంటి అన్నం మెతుకులు.

ఆకలి అతడిని ఆ గిన్నెవైపు తరిమింది.

ఆ అన్నం గిన్నె ఆ ఇంటి పనిమనిషి జగన్మోహినిది.

అసలు జగన్మోహిని అమెరికాలో పుట్టాల్సిన మనిషి. పొరపాటున ఆంధ్రదేశంలో పేద కుటుంబంలో పుట్టింది.

అయినా ఆమెకు ఏ పుస్తకాలు చదవకుండానే 'శ్రమశక్తి విలువ" సిద్ధాంతం, "డిగ్నిటీ ఆఫ్ లేబర్' విధానం తెలిసిపోయింది.

పాచిపనిలోకి చేరేముందే ఆమె యజమానులతో కాంట్రాక్టు చేసుకొంటుంది.

పనిలోకి రాగానే రోజూ టిఫిన్, కాఫీ ఇవ్వాలి. అర కిలో బియ్యానికి సరిపడ అన్నం, రెండు కూరలు, చట్నీ సాంబారులతో ఇవ్వాలి. పండగ రోజుల్లో, ఆదివారాలలో స్పెషల్ కనీసం ఒకటైనా ఉండాలి. సాయంకాలం పూట సింపుల్‌గా రెండు బిస్కట్స్, టీ ఇస్తే చాలు. పాచిపోయినవీ, పులిసిపోయినవీ పెట్టరాదు. సంవత్సరానికి రెండు చీరలివ్వాలి. రెండేళ్ళ కొకసారి తన కుటుంబంతో ఆంధ్రదేశంలో ఎక్కడికైనా వెళ్ళటానికి లీవ్ ట్రావెల్

కన్సెషన్ ఇవ్వాలి.

కాంట్రాక్టులో ఏ కండీషన్ని ఉల్లంఘించినా ఆమె లిఖితపూర్వకంగా వార్నింగ్ ఇస్తుంది. ఆ తరువాత షోకాజ్ నోటీస్... స్ట్రయిక్...

ఆవేళ ఆ ఇంటి యజమానులు కాంట్రాక్టు ఉల్లంఘించారు.

"రాత్రి అనుకోకుండా గెస్టు వచ్చారు మోహినీ. అన్నం అదీ ఎక్కువ మిగల్లేదు. ఎలాగో సర్దుకో. సాయంకాలం పెడ్తాలే" అందామె.

యజమానురాలిది భారీ చెయ్యే. అయినా రూలు రూలే కదా?

వార్నింగ్ ఇవ్వాల్సిందే.

బాగ్లో నుంచి స్టెన్సిల్ చేసిన వార్నింగ్ కాగితాన్ని ఒకదాన్ని తీసింది. దాని మీద వేలిముద్ర వేసింది.

అన్నం గిన్నెను అక్కడే అరుగుమీద ఉంచి, వార్నింగ్ కాగితాన్ని ఇచ్చి రావటానికి లోపలి కెళ్ళింది.

"ఇది రెండో వార్నింగ్ అమ్మా. ఈ తడవ షోకాజ్ నోటీస్ తప్పదు." అంటూ యజమానురాలికి ఆ కాగితాన్నిచ్చి తిరిగి దొడ్లో కొచ్చేసరికి

ఆమెకు కనిపించిన దృశ్యం-

తెరచి ఉన్న దొడ్డి వాకిలిగుండా కోటయ్య లోపలికి ప్రవేశించాడు. అన్నం గిన్నె తప్ప అతడి కళ్ళకు మరేమీ కనిపించటంలేదు.

భూతంలా, ఆకలి, అతడిని అన్నం గిన్నె దగ్గరికి నెట్టింది.

గిన్నె అతడికి కొన్ని అడుగుల దూరంలోనే ఉంది.

'ఇంతా చేస్తే వీడు అన్నం దొంగా!' అనుకొని జాలిపడబోయింది.

అంతలో ఆమెకు రూల్సు గుర్తుకొచ్చాయి.

దొంగతనం ఎంత చిన్నదైనా దొంగతనమే. నేరం.

రూల్సు ప్రకారం శిక్ష అనుభవించాల్సిందే.

ఈ అన్నం దొంగగాడికి తానే శిక్ష విధిస్తుంది.

జగన్మోహిని లోపలికి చూసి "జాకీ" అంటూ మెల్లగా ఈల వేసింది.

అంతే-

'భౌభౌభౌ'

భయంకరంగా అరుస్తూ సింహంలాంటి జాకీ ఒక్కదూకులో అక్కడి కొచ్చింది.

ఆ అరుపుకు కోటయ్య ప్రపంచంలోకి కాస్త వచ్చాడు.

ఇటు కుక్క-

అటు అన్నం-

ఆ కుక్క తన నోటికాడ అన్నం తీస్తున్న శత్రువు. కుక్కక్కూడా తాను లోకువయిపోవాలా?

అది కుక్క-

తను మనిషి-

"ఛయ్... ఛయ్..." కోపంగా అలా అంటూ అటూ ఇటూ చూశాడు. పక్కన ఓ పెద్ద బండరాయి కనిపించింది. సంజీవి పర్వతాన్ని ఎత్తి పట్టుకొన్న ఆంజనేయస్వామి అయ్యాడతను.

అమాంతం ఆ రాయిని ఎత్తి పట్టుకొని విసురుతానన్నట్లు కుక్కను భయపెట్టేడు.

కానీ, మాంసం తిని పెరిగిన ఆ విదేశీ కుక్క కోటయ్యలాంటి మనిషికి భయపడుతుందా?

అతని గుండెను చీల్చివేయడానికి ఆఖరి జంప్ చేసింది.

కోటయ్య గురి చూసి బండరాయిని దాని నెత్తిన వేశాడు.

అతడి గురి తప్పలేదు.

సింహంలాంటి ఆ కుక్క నేల కొరిగింది.

రెండో ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన చర్చిల్‌లా, గర్వంగా అతను కుక్క నొకసారి చూశాడు.

'ఆగవోయ్ చర్చిల్. ముందు నా సంగతి చూడు.' ఆకలి అతనిపై దండయాత్ర చేసి హెచ్చరించింది.

అన్నం గిన్నెవైపు చూశాడు.

కానీ అక్కడి గిన్నె... ఆ గిన్నె ఏదీ?

అన్నం ఏదీ?

జగన్మోహిని ఆ గిన్నె తీయటం అతను చూడలేదు.

ఆకలి...ఆకలి...ఆకలి...

అన్నం... అన్నం... అన్నం...

అతడికి కుక్క మీద ఎక్కడలేని కోపం వచ్చింది.

నోటిదాకా వచ్చిన కూడు జారిపోవటానికి కారణం ఆ కుక్క కాదూ?

అతడు కోపంగా కుక్క వైపు చూశాడు.

కానీ చిత్రం!

అక్కడ అతనికి కుక్క కనిపించలేదు.

తెల్లటి ఆ కుక్క శరీరం అన్నం గుట్టలా కనిపించింది.

అతడికి నోరూరింది.

అన్నం... అన్నం... అన్నం...

అతడు కుక్క మాంసాన్ని పీక్కొని అవురావురుమని తినసాగాడు.

ఆకలి మాయ ఎంతటిదో మరి!

"అమ్మగోరూ... అమ్మగోరూ... గోరం... గోరం... తొరగా రండమ్మగోరూ... ఈ డెవడో అడవి మనిసినాగున్నాడు."

జగన్మోహిని ఆ దృశ్యాన్ని చూసి అసహ్యంతో పెద్దగా అరిచింది.

ఇంట్లో వాళ్ళంతా అక్కడికి చేరారు.

"జాకీ... మైడియర్ జాకీని మర్డర్ చేశాడా?"

"కెమేరా... కెమేరా..."

"పోలీస్... పోలీస్..."

"డాక్టర్... డాక్టర్..."

"పిస్టల్... పిస్టల్..."

పనులన్నీ ఫోనులమీద జరిగిపోయాయి.

కోటయ్య పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడు.

✡ ✡ ✡

కుక్క మాసం తిన్న కోటయ్య పక్షాన జడ్జి కరుణాకరం భార్య శారద వాదిస్తుందా రోజు.

అందుచేత కోర్టు మళ్ళీ కిటకిటలాడుతోంది.

కోటయ్యను బోనులో ప్రవేశపెట్టేరు.

మూడు రోజుల క్రితం కోటయ్యలా లేడతను.

శరీరానికి సత్తువ వచ్చింది. మొహంలోకి జీవకళ వచ్చింది.

"కోటయ్యా! నువ్వు కుక్కను చంపేవా?"

"ఊ." సిగ్గుతో తల వంచుకొని అన్నాడు కోటయ్య.

కోర్టువారి పర్మిషన్‌తో శారద మాంసాన్ని ఒక ప్లేటులో తెప్పించింది.

"కోటయ్యా! ఉడకపెట్టి మసాలా వేసి చేసిన కుక్క మాసం ఇది. నీకనే ప్రత్యేకంగా చేయించాను. తిను." శారద ఆ పళ్ళాన్ని అందించింది.

అసంకల్పితంగానే కోటయ్య మొహం అసహ్యంగా పెట్టేడు.

బోనులోనే ఒకడుగు వెనక్కి వేసేడు. చేతిని వెనక్కి లాక్కొన్నాడు.

"సీసీ... మనసు లేడైనా కుక్క మాసం తింటా రామ్మగోరూ..." చాలా సహజంగా అన్నాడు.

"దట్సాల్ మైలార్డ్. ఆకలితో మాడే మనిషికి, కడుపు నిండిన మనిషికి, మధ్య తేడా తేలిపోయింది కదా? కుక్కను చంపింది, కుక్క మాంసం తిన్నది కోటయ్య కాదు. కోటయ్య కడుపులో మండిన ఆకలి. దట్స్ ఆల్."

కోర్టు హాలు నిశ్శబ్దమయింది.

తీర్పును జడ్జిగారు అప్పటికప్పుడే ఇచ్చేశారు.

"మాంసం కొరకే కోటయ్య కుక్కని చంపేడని ప్రాసిక్యూషన్ లాయర్‌గారు వాదించారు. మనిషి కుక్క మాంసం తినటం మనవజాతికే అవమానమన్నారు.

ఆ వాదనను నేను అంగీకరించలేకపోతున్నాను.

ఆకలి గొన్న మనిషి ఏం తినాలని నిర్ణయించాల్సినది కడుపు నిండిన మనిషి కాదు. ఆ విషయంలో తీర్పు నిచ్చే హక్కు కోర్టుల క్కూడా లేదు. ఎందుకంటే తనేం తినాలన్నది నిర్ణయించుకోవాల్సింది ఆకలిగొన్న మనిషి. ఆ హక్కు ప్రతి మనిషికీ ఉంది.

ఇక కుక్కను చంపేనని ముద్దాయి స్వయంగా అంగీకరించాడు.

అది తప్పే. చనిపోయిన కుక్క పట్ల భూతదయ గలిగిన ప్రతి మనిషి సానుభూతి చూపాల్సిందే.

•

కానీ అంతకన్న ముందుగా జాలిపడాల్సింది మనిషిపైన.

మనిషి, ఆకలితో తన్ను తాను మర్చిపోయి, కుక్క మాంసం తినే దౌర్భాగ్యస్థితికి నెట్టివేయబడటం ఎంత ఘోరం?

అందుచేత, చనిపోయిన కుక్క పట్ల కన్నా నాకు కోటయ్యపై సానుభూతి కలుగుతోంది.

కుక్కను చంపిన దోషం కోటయ్యది కాదు. అతని ఆకలిది. ఆ ఆకలిని తీర్చలేని సమాజానిది. సమాజానికి ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఆకలికి శిక్ష వేస్తున్నాను.

కోటయ్యకు మూడు నెలలు జైలు శిక్ష విధిస్తున్నాను.

ఈ మూడు నెలలు అతనికి కడుపునిండా తిండి పెట్టాలి.

ఆ తరువాత అతడికి ఉపాధి చూపించి జైలు నుంచి విడుదల చెయ్యాలి."

కోటయ్య అప్పుడు తలెత్తి జడ్జిగారి వైపు చూచాడు.

అతని కళ్ళలో వింత వెలుగు !

"దండాలయ్యా దరమప్పెబో!"

చేతులెత్తి జడ్జిగారికి నమస్కరించాడు.

ఆంధ్రప్రభ వారపత్రిక 13-4-88